క్లుప్తంగా

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో

దహెగాం: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఏవో రామకృష్ణ తనిఖీ చేశారు. మందులను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. యాసంగి సీజన్‌కు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంతో పాటు, లగ్గాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో వంశీ ఉన్నారు.

బావి మోటార్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని కసాబ్‌వాడీలో ఉన్న తాగునీటి బావిలో కొంతకాలంగా పంపు మోటార్ పనిచేయక కాలనీవాసులు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. విషయాన్ని బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఉదయం ఆయన మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి వెళ్లి మోటార్‌కు మరమ్మతులు చేయించారు. ఆయన వెంట తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, నాయకులు సుంకరి పెంటయ్య, సైదం మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోపాటు చదువులో రాణించాలి



వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎస్సై గంగన్న

లింగాపూర్: మండలంలోని జాముల్‌ధరాలో గురువారం పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గంగన్న మాట్లాడుతూ యువకులు క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. అనంతరం గ్రామ యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



దుస్తులు అందజేస్తున్న అరుణ

బెజ్జూర్: మండలంలోని అందుగులగూడలో కొర్తే పవన్‌కళ్యాణ్ అనే రైతుకు చెందిన ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న గౌడ సంఘం మోకుదెబ్బ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కొండ్రా అరుణగౌడ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి దుస్తులు అందజేశారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

పీసీసీఎఫ్‌ను కలిసిన ఎమ్మెల్సీ



వినతిపత్రం ఇస్తున్న దండే విఠల్

బెజ్జూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ గురువారం హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి ఆర్‌ఎం డోబ్రియాల్‌ను కలిశారు. సిర్పూర్ నియోజకవర్గంలో నిలిచిన పలు రహదారుల నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా కేతిని గ్రామం నుంచి దిందా వరకు వంతెన నిర్మాణానికి అనుమతులు ఇప్పించి త్వరితగతిన ప్రారంభించాలని కోరారు.

24 నుంచి హనుమాన్ దీక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఏప్రిల్ 12న చైత్రశుద్ధ పౌర్ణమి హనుమాన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఈ నెల 24 మంగళవారం నుంచి 108 రోజుల దీక్షలు ప్రారంభించనున్నట్లు డీడీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆలయ అర్చకుడు ఒజ్జల శిరీష్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాలధారణ చేసుకునే భక్తులు కావాల్సిన సామగ్రితో ఉదయం ఆలయానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

నిరుపయోగమేనా?

- డంపింగ్‌యార్డు ఓ చోట..
  చెత్త మరోచోట..
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



దహెగాం: పెట్రోల్ పంపు సమీపంలో పడేసిన చెత్త



దహెగాం: పార్వతిపేట చిన్న ఐనం శివారు వద్ద నిరుపయోగంగా డంపింగ్‌యార్డు

లింగాపూర్/దహెగాం: గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త పారవేయడం వల్ల దోమలు వృద్ధిచెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో డంపింగ్ యార్డులు నిర్మించింది. గ్రామాల్లో చెత్తను సేకరించడానికి ట్రాక్టర్లను సైతం అందుబాటులో ఉంచింది. కానీ ప్రత్యేకాధికారుల పాలనలో అధికారుల పట్టింపులేని కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించకుండా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులు నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలి. ఆ తర్వాత ప్లాస్టిక్, కూరగాయలు, ఇతర వ్యర్థాలు వేరుచేసి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. కానీ ఇది కొన్ని గ్రామాలకు మాత్రమే పరిమితం అవుతోంది. లింగాపూర్ మండలంలోని పిక్లాతండా, కొత్తపల్లి, దంపూర్, గుమ్నూర్, కంచన్‌పల్లి, జాముల్‌ధరా, మోతీపటార్ తడి, పొడి చెత్త డంపింగ్ యార్డులకే పరిమితం అవుతోంది.

కానరాని వానపాములు

ఏడాది క్రితం సేంద్రియ ఎరువు తయారీకి ప్రభుత్వం వానపాములను సరఫరా చేసింది. ఒక్కో జీపీకి సుమారు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చుచేసి వాటిని పంపిణీ చేసింది. వానపాములను కంపోస్ట్ షెడ్లలో చెత్తా చెదారం వేసి ఉంచాలి. రెండు రోజులకు ఒకసారి పర్యవేక్షించి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా ఇలా జరగడంలేదని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

వినియోగంలోకి తెస్తాం



గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకువస్తాం. డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న ప్లాస్టిక్ కవర్లను పంచాయతీ కార్మికుల చేత ఏరివేయిస్తాం. తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసేలా కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం.

– రజనీకాంత్, ఇన్‌చార్జి ఎంపీవో, లింగాపూర్

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి



అసెంబ్లీలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గంలోని పోడురైతులపై అత్యుత్సాహం చూపిస్తున్న ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు గురువారం అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామంలోని 119 సర్వే నంబర్‌లో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి 2002–2004 మధ్యకాలంలో రెండువేల ఎకరాల అసైన్డ్ భూమికి పట్టాలు ఇచ్చారని, 2014 వరకు ఎలాంటి సమస్య లేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక అందులో మొక్కలు నాటారన్నారు. 2021లో పోడు రైతులకు మద్దతుగా నిరహార దీక్షకు కూర్చుంటే తనతో పాటుగా 60 మంది రైతులను రిమాండ్ చేసి 40 రోజులు ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉంచారన్నారు. పోడు రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు.

ప్రజాపాలనలో కళాకారుల పాత్ర అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న వెన్నెల, హాజరైన కళాకారులు

ఆసిఫాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల పాత్ర అభినందనీయమని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సారథి కార్యాలయంలో కళాకారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు కొప్పర్తి సురేందర్, గుడిసెల బాపు, కోదాడి సోమశేఖర్, మరప పురుషోత్తం, కుమ్మరి శ్రావణ్‌కుమార్, గుండ శిరీష, గొల్లపల్లి సురీష, తదితరులు పాల్గొన్నారు.

యువత సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత క్రీడలతో పాటు చదువులో రాణించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. గురువారం మండలంలోని గౌరపూర్ గ్రామంలో గ్రామ కమిటీ, ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత యువత సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల్లో, చదువులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ మసుద్, జితేందర్, మడావి మారుతి, భుమేష్, మడావి సుంగు, సుర్పం మాధవ్‌రావ్, సుర్పం సాయి పాల్గొన్నారు.

'ముందస్తు అరెస్టులు సరికావు'



పోలీస్‌స్టేషన్ ఆవరణలో నాయకులు

వాంకిడి: న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న తమను అరెస్టు చేయడం సరికాదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చలో అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు పోలీసులు గురువారం మండలంలోని పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు అశోక్ మహోల్కర్, విలాస్, రాజేంద్ర ప్రసాద్, దుర్గం ప్రశాంత్, చింటు, రోషన్, కంకేశ్వర్, రమేశ్, నూతన్, నగేష్, కమలాకర్, దీపక్, తదితరులు ఉన్నారు.

దహెగాం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చలో అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దుంద్ర శ్రీనివాస్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆలోచన మానుకోవాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతి అందజేస్తున్న విశ్వప్రసాద్

వాంకిడి: క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అన్నారు. మండలంలోని చౌపన్‌గూడలో గంగారాజ్ భీమన్న దేవర జాతర ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహించిన కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. అనంతరం పోటీల్లో విజేతగా నిలిచిన ఆసిఫాబాద్ జట్టుకు రూ.15 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, నాయకులు అనిల్, దుర్గం ప్రశాంత్, దాదాజీ, రామ్‌బాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఆర్టీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



మాట్లాడుతున్న కోట్నాక గణపతి

తిర్యాణి: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్టీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఆర్టీలు సమ్మెకు దిగడంతో గిరిజన శాఖ పరిధిలోని ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతబడ్డాయన్నారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రావు, కార్యదర్శి పర్చకి జంగు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న స్వీపర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: పౌర గ్రంథాలయాల్లో పనిచేస్తున్న స్వీపర్లు తమ వేతనాన్ని రూ.15,600లకు పెంచాలని గురువారం జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఎలాంటి వేతన పెంపు జరగలేదన్నారు. అరకొర వేతనాలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం గుర్తించి కనీస వేతనంగా రూ.15,600 ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో స్వీపర్లు సయ్యద్ సలీం, చెన్నోజి రామయ్య, అశోక్, రాజారాం, సురేష్, ప్రేమ్‌సాగర్, బుచ్చన్న, రాజన్న, అరుణ, తదితరులు ఉన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు



కౌటాల: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



బెజ్జూర్: దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలో కేవీపీఎస్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు దినకర్ మాట్లాడుతూ అమిత్‌షా మాట్లాడిన తీరు దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉందన్నారు. ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలు అంబేడ్కర్‌ను మేధావిగా కీర్తిస్తుంటే మన దేశ పాలకులు మాత్రం తులనాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీకానంద్, కార్తీక్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో గురువారం దళిత, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు లహన్‌రాజ్, ఆశన్న, బిట్టి శ్రీనివాస్, సోయం చిన్నయ్య, తిరుపతి, భీమయ్య, ప్రేమానందం, గోపాల్, మధుకర్, మల్లేష్, సతీష్, యాదవ్, బాపు, శ్రీను, దాము, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుస శంకర్ యాదవ్, నాయకులు అబ్దుల్ హకీమ్, సుంకరి విష్ణుమూర్తి చారి, చటారి హనుమంతు, దుర్గం దాసు, జాజిమొగ్గ రవి, వెంకటేష్, డోకే గణేష్, కుమ్మరి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

సిర్పూర్(టి): అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు నగ్రాడె రాజు, పిప్రె ప్రభాకర్, దుర్గం తులసీరాం, తుకారాం, దుర్గం తిరుపతి, ప్రభాకర్, గణేశ్, తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించం

కౌటాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించబోమని మహర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పీ.బండురావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ వద్ద కౌటాల–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బసర్కార్ విశ్వనాథ్, దుర్గం వెంకటేశ్, జానికీరావ్, దిలీప్, కిశోర్, పత్రు, మధుకర్, రవి, ఏమాజీ, గోవింద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ నిర్మాతపై వ్యాఖ్యలు సరికాదు'



ఆందోళన చేస్తున్న నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు సరికాదని భారతీయ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి, ఎన్‌హెచ్– 363పై రాస్తారోకో చేపట్టారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, చట్టాలతోనే అమిత్ షా కేంద్ర హోం మంత్రి హోదాలో ఉంటూ.. అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ నిరసనకు మద్దతు తెలిపారు. అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ మండల అధ్యక్షుడు ఉప్రె జైరాం, బౌద్ధ సమాజ్ మండల అధ్యక్షులు విలాస్, రాజేంద్రప్రసాద్, శేఖర్, తిరుపతి జాడె, అంబేడ్కర్ సంఘం నాయకులు దుర్గం సునీల్, మహేశ్, హంసరాజ్, శ్యాంరావు, రోషన్, కిషన్, మారూతి తదితరులు పాల్గొన్నారు.

పదో రోజుకు 'సమగ్ర' ఉద్యోగుల సమ్మె



సమ్మె శిబిరంలో ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. పదో రోజు గురువారం మెడలో దండలు వేసుకుని ఉద్యోగులు నిరసన తెలిపారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సమ్మెకు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

తలమడుగు: బాలికలు అన్ని రంగాలలో రాణించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త యశోద అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు బాలికలను రక్షిద్దాం, చదివిద్దామని కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికల విద్య ప్రాధాన్యత గురించి వివరించారు. విద్యార్థులు ఉన్నత చదువు చదివినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ఇంచార్జి హెచ్‌ఎం చంద్రమ్మ, సిబ్బంది కోటేశ్వర్, నిఖిలేశ్వర్, రమాకాంత్, పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంచాలి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

రెబ్బెన: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంపునకు కృషి చేయాలని రెబ్బెన కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయరాణి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ అందించిన ఐఈసీ, లిటరసీ క్లౌడ్ పోస్టర్‌లు, జెండర్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ కరపత్రాలను అందజేశారు. అనంతరం జెండర్ ఈక్వాలిటీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగయ్య, ఉపాధ్యాయురాలు కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.